జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనుల పరిశీలన

పార్వతీపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో చేపడుతున్న జీడి ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణాన్ని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలిచ్చారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. నాణ్యతలో రాజీపడకుండా నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఈ సందర్శనలో గిరిజన సంక్షేమశాఖ కార్య నిర్వాహక ఇంజనీర్ మణిరాజ్, ఏపీవో మురళీధర్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ ఇంకెప్పుడు?

- పాలకొండలో రోజురోజుకూ జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య
- నరకం చూస్తున్న వాహనదారులు, ప్రయాణికులు
- గాలిలో కలిసిపోయిన వైసీపీ ప్రభుత్వ హామీ
- ఐదేళ్లూ హడావుడితోనే సరి.. ప్రతిపాదనలకే పరిమితమైన పనులు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు



పాలకొండ ప్రధాన రహదారి

పాలకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రం పాలకొండ ప్రధాన రహదారి విస్తరణ ప్రశ్నార్థకంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా పనులు జరగకపోవడంతో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు రోజూ నరకం చూస్తు న్నారు. పట్టణంలో ఆర్టీసీ డిపో నుంచి వీరఘట్టం జంక్షన్ వరకు 2.1 కిలోమీటర్ల ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపడతామని గత వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. అయితే ఐదేళ్ల కాలంలో రహదారి విస్తరణ చేపట్టలేక పోయింది. దీంతో ప్రజలకు నిరాశే మిగిలింది. విస్తరణ పనులు ప్రతిపాదనలకే పరిమితమైన క్రమంలో పట్టణవాసులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.



ప్రధాన రహదారి కాలువపై ఆక్రమణలు ఇలా..

ఇదీ పరిస్థితి..

- పాలకొండలో నెలకొన్న ట్రాఫిక్ దృష్ట్యా వంద అడుగులు మేర రహదారి విస్తరణ కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 60 అడుగులు మేర మాత్రమే రహదారి ఉంది. ప్రధానంగా ఏలాం జంక్షన్ నుంచి వీరఘట్టం జంక్షన్ వరకు రహదారి విస్తరణ పనులు జరిగితే తప్ప ట్రాఫిక్ సమస్య నుంచి వాహనచోదకులు, ప్రయాణికులు గట్టెక్కే పరిస్థితి లేదు.
- పట్టణంలోని ప్రధాన రహదారి నుంచి రోజూ వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జిల్లాతో పాటు ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే భారీ వాహనాలు ఈ రహదారి గుండా ప్రయాణిస్తుంటాయి. విజయనగరం జిల్లా రేగిడి మండలంలో ఉన్న చక్కెర కర్మాగారానికి ఈ మార్గం గుండానే చెరుకు లోడ్లతో వాహనాలు వెళ్తుంటాయి. అయితే పాలకొండ ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. బల్లంకివీధి జంక్షన్, కోటదుర్గమ్మ ఆలయ జంక్షన్, నాగావంశంపు వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, వడమ జంక్షన్‌లో నిత్యం వాహనాలు నిలిచిపోతున్నాయి. రెండు బస్సులు ఎదురెదురుగా వచ్చినా, భారీ వాహనాలు వచ్చినా అంతే సంగతి. వాహనదారులకు నిరీక్షణ తప్పడం లేదు.

రహదారికి ఇరువైపులా ఆక్రమణలు..

పాలకొండ ప్రధాన రహదారికి ఇరువైపులా ఇష్టానుసారంగా వాణిజ్య సముదాయాలు పుట్టుకొస్తున్నాయి. సుమారు 450 నుంచి 550 వరకు అక్రమ కట్టడాలు ఉన్నట్టు తెలుస్తోంది. కాలువలపై ఆక్రమణలు పెరిగిపోవడంతో రహదారి మరింత ఇరుకుగా తయారైంది. రహదారి పొడువునా ఇదే పరిస్థితి ఉండడంతో ట్రాఫిక్ మరింత జఠిలమవుతుంది. దీనిపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.



రహదారి పక్కన ఏర్పాటైన షాపులు

ప్రభుత్వ చొరవ..

పీపీపీ విధానంలో కళింగపట్నం, శ్రీకాకుళం, పాలకొండ మీదుగా పార్వతీపురం వరకు ఉన్న 113.40 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సర్వేను కూడా పూర్తి చేసింది. రహదారి విస్తరణతో పాలకొండలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని, వ్యాపార అభివృద్ధి కూడా జరుగుతుందని స్థానికులు భావిస్తున్నారు.

రూ.16.5 కోట్లతో ప్రతిపాదనలు..

పాలకొండ ఆర్టీసీ డిపో నుంచి వీరఘట్టం జంక్షన్ వరకు ప్రధాన రహదారి విస్తరణకు రూ.16.5 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానం ద్వారా ప్రధాన రహదారుల విస్తరణకు సర్వే చేసింది. నిధులు మంజూరైతే 80 అడుగుల రహదారి విస్తరణతో పాటు రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మాణం, సెంటర్ లైటింగ్ పనులు చేపడతాం. -కిరణ్‌కుమార్, జేఈ, ఆర్అండ్‌బీ

18లోగా పూర్తయ్యేనా?

- టీడీపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియకు సమీపిస్తున్న గడువు
- కసరత్తు ప్రారంభించిన ఎమ్మెల్యేలు

పార్వతీపురం, మే13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీడీపీ సంస్థాగత ఎన్నికల సందడి ప్రారంభమైంది. ఈ నెల 18లోపు రాష్ట్ర కమిటీ మినహా మిగిలిన కమిటీలకు ఎన్నికలు పూర్తి చేయాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నెలాఖరులో కడపలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి ముందుగానే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఈ బాధ్యతను ఎమ్మెల్యేలకు అప్పగించారు. దీంతో జిల్లాలోని నియోజకవర్గాల్లో సంస్థాగత ఎన్నికల హడావుడి మొద లైంది. అయితే గడువు తక్కువగా ఉండడంతో ఆ లోపుగా ఎన్నికల ప్రక్రియ పూర్త య్యేనా? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమ వుతున్నాయి. వాస్తవంగా పార్టీ కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాల మేరకు సంస్థాగత ఎన్నికల కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ గతంలో పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జిల సూచించిన వారికే కమిటీల్లో స్థానం కల్పించారు. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి ఉంటుందనే అభిప్రాయం వ్యక్త మవుతోంది. కాగా రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కమిటీలు ఏర్పాటయ్యే అవకాశం ఉందనే వాదనలు లేకపోలేదు. విజయమే లక్ష్యంగా చేసుకుని కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని నియోజకవర్గ ఎమ్మెల్యేలు భావిస్తున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్టుగా కసరత్తు కూడా ప్రారంభమైంది. అయితే ఈ కమిటీల్లో పాత వారికి అవకాశం ఇస్తారా? లేక కొత్తవారికి ప్రాధాన్యం ఇస్తారా అన్నది! ప్రశ్నార్థకంగా మారింది.

పర్యాటక పనులు వేగవంతం

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, మే13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటకాభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. తోటపల్లి, ఏనుగుకొండ, పెద్దగెడ్డ, వీరఘట్టంలోని కూర్మసాగరం ప్రాంతాలు బోటింగ్‌కు అనుకూలమని, వాటిపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' ఐదు ప్రాంతాల్లో స్పీడ్ బోటింగ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. దీనిపై శిక్షణకు గిరిజన యువత ఎంపిక చేయాలి. బోటింగ్ నిర్వహణ ప్రైవేటు సంస్థలు లేదా ఇతరులు నిర్వహించు కోవచ్చు. నాణ్యతా ప్రమాణాలు కలిగిన బోట్లును వినియోగించాలి. సీతంపేట మండలం పనుకు పేటలో గిరి గ్రామదర్శిని పనులు త్వరగా ప్రారంభం కావాలి. గ్రామదర్శినిలో గిరిజన సంస్కృతి ప్రతిబింబిచేలా మట్టితో ఏర్పాటు చేసిన గృహాలు ఉండాలి. ఉత్తమ గృహానికి బహుమతిని ప్రకటిస్తాం. ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారం, గిరిజనులు వినియోగించే సామగ్రి, వస్తువులతో ఆర్ట్ గ్యాలరీ ఉండాలి. థింసా నృత్యం, విక్రయ దుకాణాలు, కల్యాణ మండపం వంటి ఏర్పాట్లు అందులో ఉండాలి. వచ్చే నెలలోగా ప్రారంభిం చేలా చర్యలు తీసుకోవాలి. అడలి వ్యూపాయింట్ వద్ద వసతిగృహ నిర్మాణ పనులు ఆగస్టు నాటికి పూర్తి కావాలి. జగతిపల్లి రిసార్ట్ ప్రాంతాన్ని ప్రత్యామ్నాయ మార్గం ద్వారా అభివృద్ధి చేయాలి. సీతంపేటలో మ్యూజియం, వాటర్ ఫాల్స్‌పై ప్రత్యే దృష్టి సారించాలి. జిల్లా అటవీశాఖా ధికారి సహకారంతో ఈ పనులన్నీ నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలి.' అని కలెక్టర్ స్పష్టం చేశారు.

- 'వడగాడ్పుల దృష్ట్యా ప్రజలకు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి హామీ కూలీలు, పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించాలి. వారు చేయాల్సిన పనులేమిటో స్పష్టంగా తెలియజేయాలి. అంతటా చలివేంద్రాలు నిరంతరం నడపాలి. వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో వేసవి తీవ్రత, అకాల వర్షాలు, ఈదురుగాలులపై ప్రజలను అప్రమత్తం చేయాలి. ఈ నెలలో మూడో శనివారం స్వర్ణ ఆంధ్రా, స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టాలి. ' అని కలెక్టర్ తెలిపారు.

ఇసుక రీచులు సిద్ధం

భామిని మండలం నేరడి, పాలకొండ మండలం చినమంగళాపురం వద్ద రీచుల నుంచి ఇసుక సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఇసుక సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్టాక్ పాయింట్లు సిద్ధంగా ఉండాలని, అక్రమ రవాణాకు తావు లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. గట్టి బందోబస్తు, బారికేడ్లు, చెక్‌పోస్టు, ఆన్‌లైన్ వే బిల్లు, రిజిస్టర్లు, రికార్డులు అన్నీ పక్కాగా ఉండాలని ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జై పైడిమాంబ


- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఆలయానికి భక్తుల తాకిడి
- ముగిసిన దేవర ఉత్సవం

6లో



ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ నియామకం

పార్వతీపురం, మే13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ (జిల్లా ఆరోగ్య సేవల సమన్వయకర్త)గా నాగభూషణరావు నియామక మయ్యారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన పాలకొండ ఏరియా ఆసుపత్రి సూపరిం టెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో పార్వతీపురం ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా, విజయనగరం డీసీహెచ్ఎస్‌గా విధులు నిర్వహించారు. తాజాగా ఆయన్ని మన్యం జిల్లా ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.



డీసీహెచ్ఎస్ నాగభూషణరావు

ఇంటర్‌లో కొత్తపాఠం

- సీబీఎస్ఈ సిలబస్ అమలుకు సన్నాహాలు
- పోటీపరీక్షల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళిక
- ఈ ఏడాది ఫస్ట్ ఇయర్ పుస్తకాల మార్పు

6లో



మాక్‌డ్రిల్‌కు సిద్ధం

- నేడు పార్వతీపురంలో నిర్వహణ
- జాయింట్ కలెక్టర్ శోభిక

పార్వతీపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో పౌరుల సురక్షిత, సంసిద్ధతకు బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శోభిక తెలిపారు. మాక్‌డ్రిల్ సన్నాహక చర్యలపై మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉదయం 9 గంటలకు భద్రతా మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా వైమానిక దాడులతో సహా ఇతర అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అటువంటి సమయాల్లో ఎలా ప్రతిస్పందించాలో తెలపడంతో పాటు స్వీయ రక్షణపై ప్రజలు, విద్యార్థులను చైతన్యపర్చాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య అగ్నిమాపక అధికారి శ్రీనుబాబు, డీఆర్వో కె.హేమలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ

మన క్రీడా విధానం ఆదర్శం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, మే 13 (ఆంధ్రజ్యోతి): 'క్రీడా విధానంలో మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుంది.' అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం విజయనగరం జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జరుగుతున్న 3వ జాతీయ తైక్వాండో శిక్షణ సెమినార్‌కు ఆయన హాజరయ్యారు. క్రీడాకారులకు ఇస్తున్న శిక్షణను తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్క మనరాష్ట్రంలోనే క్రీడాకారులకు ఉద్యోగాల భర్తీలో 3 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నాం. క్రీడల కోసం పెద్దఎత్తున మౌలిక వసతులు సమకూర్చుతున్నాం. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించి రాష్ట్రానికి, మన ప్రాంతానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకురావాలి.' అని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గురాన అయ్యలు, రాష్ట్రకార్యదర్శి సీహెచ్ వేణుగోపాల్, అంతర్జాతీయ క్రీడాకారుడు, తైక్వాండో కోచ్ కె.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



తైక్వాండో శిక్షణ ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

శ్యామలాంబ పండగకు 1240 బస్సులు

- సాలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మూర్తి

6లో

బతికుండగానే చంపేశారు!

- సంక్షేమ పథకాలు కోల్పోయిన మహిళ
- టీడీపీకి ఓటేసిందని పింఛన్ తొలగించిన వైసీపీ
- కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగని వైనం

8లో

బయోమెట్రిక్ పరికరాలతో

సర్వేలు సులభతరం

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, మే13(ఆంధ్రజ్యోతి): బయోమెట్రిక్ పరికరాలతో ఆరోగ్య సర్వేలు సులభమవుతాయని, లక్ష్యాలను సకాలంలో చేరుకోవడంలో అవి ఎంతగానో దోహదపడతాయని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లాకు మంజూరైన 695 బయోమెట్రిక్ పరికరాలను మంగళవారం తన కార్యాలయంలో వైద్య సిబ్బందికి అందించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో సిబ్బందికి వాటిని అందిస్తామన్నారు. ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే సర్వే, ఈహెచ్ఆర్ నమోదుకు ఇక ఇబ్బందులు ఉండవని ఆయన తెలిపారు. బయోమెట్రిక్ పరికరాలతో వేలి ముద్రలను సేకరించి త్వరగా వివరాలను నమోదు చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు టి.జగన్మోహన్‌రావు, రఘుకుమార్, తదితరులు పాల్గొన్నారు.



బయోమెట్రిక్ పరికరాలను అందిస్తున్న డీఎంహెచ్‌వో

ఇంటర్‌లో కొత్తపాఠం

- సీబీఎస్ఈ సిలబస్ అమలుకు సన్నాహాలు
- పోటీపరీక్షల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళిక
- ఈ ఏడాది ఫస్ట్ ఇయర్ పుస్తకాల మార్పు
- ఇంటర్ విద్యను ప్రక్షాళన చేస్తున్న ప్రభుత్వం



రాజాం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి)

ఇంటర్ విద్యలో ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతానికి భిన్నంగా తరగతుల నిర్వహణ, పీరియడ్ల సంఖ్యతో పాటు కళాశాలల సమయం పెంపుదలకు వీలుగా ప్రణాళిక సిద్ధం చేసింది. పాఠాలకే పరిమితం కాకుండా పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజయం సాధించేలా తీర్చిదిద్దే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. గతంలో విద్యార్థుల ఉత్తీర్ణత సంఖ్య, శాతాలకే పరిమితమైన ఇంటర్మీడియట్ విద్యాశాఖ.. నేడు ఇంటర్‌లో ఏ ఒక్కరు ఫెయిల్ కాకుండా.. నీట్, ఎంసెట్, జేఈఈ తదితర పోటీ పరీక్షలను తట్టుకునేలా తయారు చేసేలా లక్ష్యాలను పెట్టుకుంది. ఇందులో భాగంగా పాత విద్య, పరీక్ష విధానానికి స్వస్తి పలికింది. ఎన్‌సీఈఆర్‌టీ అమలు చేస్తున్న సీబీఎస్ఈ పుస్తకాలను ఈ ఏడాది నుంచే మొదటి సంవత్సరం విద్యార్థులకు అందజేయనుంది. సీబీఎస్ ఈ పరీక్ష విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఈ ఏడాది ఇంటర్ ఫస్ట్ ఇయర్‌కు సంబంధించి అన్ని గ్రూపుల పాఠ్య పుస్తకాలను పూర్తిగా మార్చి వేసింది అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఎంబైపీసీ గ్రూపును కూడా ప్రవేశపెడుతోంది. విద్యార్థులకు కొత్త సిలబస్‌ను బోధించేందుకు వీలుగా అధ్యాపకులకు శిక్షణ ఇస్తోంది.

ఇదీ నూతన విధానం..

గణితం ఏ, బీ ఒక సబ్జెక్టుగా, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం కలిపి బయాలజీగా రూపొందించారు. ఇందుకు తగ్గట్టుగా మార్కుల విభజన చేశారు. పార్ట్ 1 కింద ఇంగ్లీష్ ఉంటుంది. పార్ట్ 2 కింద జాతీయ భాషలతో పాటు మరికొన్ని సబ్జెక్టులుంటాయి. విద్యార్థి ఇష్టం మేరకు ఏ సబ్జెక్టును అయినా ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించారు. పార్ట్ 3లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉంటాయి.

అదనపు ప్రయోజనాలు ఇలా..

నూతన విధానంలో ఎంపీసీ తీసుకున్న విద్యార్థులు అదనంగా బయాలజీ.. బైపీసీ తీసుకున్న విద్యార్థులు అదనంగా మ్యాథ్స్ తీసుకునే అవకాశం కల్పించారు. అయితే పార్ట్ 1, 2, 3 సబ్జెక్టులలో వచ్చిన మార్కులనే పరిగణనలోకి తీసు కుంటారు. అదనంగా తీసుకున్న సబ్జెక్టుల్లో వచ్చిన మార్కు లను ఇందులో కలపరు. ఎప్పటిలాగే కనీసం 35 మార్కు లు వస్తే పాస్ అయ్యే విధానాన్ని కొనసాగిస్తున్నారు.

పోటీ పరీక్షలకు ప్రాధాన్యం..

గతంలో ఇంటర్ విద్యార్థులకు లెక్చరర్లు స్టేట్ సిలబస్‌ను బోధించి ఆమేరకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ షెడ్యూల్ మేరకు పరీక్షలు నిర్వహించేవారు. ఇదే సమయంలో ఎక్కువ మంది విద్యార్థులు పాస్ అయ్యేందుకు, ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు కృషి చేసేవారు. అయితే సీబీఎస్ఈ విధానాన్ని అడాప్ట్ చేసుకున్న నేపథ్యంలో మార్కులకు అంతగా ప్రాధాన్యం ఇవ్వకుండా.. విద్యార్థులు పోటీ పరీక్షల్లో నిలదొక్కుకునేలా బోధిస్తారు. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలతో పాటు ఎంసెట్ ఇతరత్రా పరీక్షలకు శిక్షణనిచ్చేలా రూపకల్పన చేశారు. ఇందుకోసం కళాశాలల సమయాలను, టైంటేబుల్‌లో మార్పులు చేశారు. గతంలో ప్రభుత్వ కళాశాలలుఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించగా.. తాజా నిర్ణయం ప్రకారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు తరగతులు ఉంటాయి. గతంలో వారానికి 42 పీరియడ్స్ ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్యను 48కి పెంచారు. పెరిగిన 6 పీరియడ్స్‌లో పోటీపరీక్షలకు అవసరమైన శిక్షణనిస్తారు.

పోటీ పరీక్షల్లో నిలదొక్కుకునేలా..

ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షలలో సత్తా చాటేందుకు వీలుగా ప్రభుత్వం సంస్కరణలు చేపట్టింది. ఇందుకోసం ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను ఇంటర్‌లో ప్రవేశపెడుతోంది. సీబీఎస్ఈ పరీక్ష విధానాన్ని అమలు చేస్తోంది. దీనివల్ల విద్యార్థులు పోటీ పరీక్షల్లో నిలదొక్కుకుని విజయం సాధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పోటీ పరీక్షల శిక్షణ కోసం వారానికి ఆరు పీరియడ్స్ కేటాయించారు.

-తవిటినాయుడు, ఆర్ఐవో, విజయనగరం

రీసర్వేతో రైతులకు మేలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. భూ సమస్యలు తొలగి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మంగళవారం తాళ్లబురిడిలో రీసర్వే ప్రక్రియను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'రీ సర్వే జరిపే ముందు రైతులకు నోటీసులు జారీ చేయాలి. వారి సమక్షంలోనే కొలతలు వేసి మీ భూ సరిహద్దులు నిర్ణయించాలి. రీ సర్వేలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలి.' అని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. ఎఫ్ఎంసీ విచారణ పూర్తి చేసి మ్యూటేషన్‌లను పరిష్కరించాలన్నారు. రైతులు పక్కా భూ రిజిస్ట్రేషన్లు చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. రోడ్లుకు కేటాయించిన భూముల్లో హద్దులు నిర్ణయించి రక్షణ కల్పించాలన్నారు. చెరువులు, వాగుల్లోని ఆక్రమణలు తొలగించాలని సూచించారు.

రక్త నిల్వలు పెంచాలి..

బెలగాం: జిల్లాలో రక్త నిల్వలు పెంచాల్సి ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జనరల్ వార్డు, బ్లడ్ బ్యాంక్, కంటి తనిఖీ కేంద్రం తదితర విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అత్యవసర కేసుల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనీమియా కేసులు ఎక్కువగా వస్తున్నట్లు వైద్యులు తెలిపారు. శిబిరాలు నిర్వహించి రక్త నిల్వలు పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ సూచించారు. అనంతరం రక్త నిల్వల కేంద్రంలోని పరికరాలను పరిశీలించి నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆ తర్వాత రోగులకు అందిస్తున్న ఆహారం పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని హెచ్చరించారు. ఈ పరిశీలనలో సూపరింటెండెంట్ నాగ శివజ్యోతి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

శ్యామలాంబ పండగకు 1240 బస్సులు

- సాలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మూర్తి

సాలూరు రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): సాలూరు శ్యామలాంబ పండగకు వచ్చే భక్తుల కోసం 1240 బస్సులను నడపనున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ బీఎస్ఎన్ మూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపడానికి కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఈ నెల 18,19 తేదీల్లో సాలూరు డిపో నుంచి 52, పార్వతీపురం 11, విజయనగరం 13, పాలకొండ 5, శ్రీకాకుళం-1 నుంచి 9, శ్రీకాకుళం-2 నుంచి 10, పలాస 5, టెక్కలి 5, విశాఖ నుంచి 10 చొప్పున రెండు రోజులకు 240 బస్సులను నడుపుతామని వెల్లడించారు. సిరిమానోత్సవం సందర్భంగా ఈ నెల 20, ఆ మరుసటి రోజు 21న సాలూరు డిపో నుంచి 75, పార్వతీపురం 60, విజయనగరం 55, పాలకొండ 50, ఎస్.కోట 30, శ్రీకాకుళం-1 నుంచి 35, శ్రీకాకుళం-2 40, పలాస 25, టెక్కలి 25, విశాఖ నుంచి 105 చొప్పున రెండు రోజులకు 1000 బస్సులు నడుపుతామన్నారు. రామభద్రపురం, పాచిపెంట వైపు నుంచి వచ్చే బస్సులను జీగిరాం వద్ద ఏర్పాటు చేసి తాత్కాలిక పాయింట్ వద్ద నిలిపివేస్తామని తెలిపారు. ప్రజలు తిరుగు ప్రయాణంలో సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆయా బస్సులు ఎక్కొచ్చన్నారు. మామిడిపల్లి నుంచి వచ్చే బస్సులను నారాయణ స్కూల్ పార్కింగ్, మక్కువ వైపు నుంచి వచ్చే వాటిని బైపాస్‌రోడ్డు పార్కింగ్ పాయింట్లు నుంచే రాకపోకలు సాగిస్తాయని వివరించారు. ప్రయాణికులు ఆర్టీసీకి సహకరించాలని కోరారు.



పండగ బస్సు సర్వీస్ కోసం కార్యాచరణ చేస్తున్న ఆర్టీసీ సాలూరు డీఎం బీఎస్ఎన్ మూర్తి



నూకాలమ్మ ఘటాన్ని మోస్తున్న మంత్రి సంధ్యారాణి

ఘనంగా నూకాలమ్మ పండగ

పాచిపెంట, మే13 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట గ్రామదేవత నూకాలమ్మ పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. సాలూరు శ్యామలాంబ పండగకు ముందు వారం పాచిపెంట నూకాలమ్మ పండగ నిర్వహించడం ఆచారం. ఆ క్రమంలో ఈ పండగను వైభవంగా ఉత్సవ కమిటీ నిర్వహించింది. సుమారు లక్ష మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మొక్కుబడులు చెల్లించుకున్నారు. పండగ నేపథ్యంలో అమ్మవారి ఘటాలను గ్రామంలో సంప్రదాయబద్ధంగా ఊరేగించారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అమ్మవారి ఘటాలను మోశారు. నూకాలమ్మకు పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు రావడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు.

జై పైడిమాంబ

- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఆలయానికి భక్తుల తాకిడి
- ముగిసిన దేవర ఉత్సవం



ఘటాలకు పూజలు నిర్వహిస్తున్న ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు, అర్చకులు, సిబ్బంది

విజయనగరం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి భారీ ఊరేగింపు అనంతరం మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో అమ్మవారిని వనంగుడి నుంచి చదురుగుడికి తీసుకురావడంతో దేవర ఉత్సవం ముగిసింది. పంచామృతాభిషేకం అనంతరం భక్తులకు దర్శనాన్ని కల్పించారు. పైడిమాంబను వివిధ రకాల పూలతో అలంకరించారు. మామిడి పండ్లను, వివిధ రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జై పైడిమాంబ, జై జై పైడిమాంబ నామస్మరణతో చదురుగుడి పులకించింది. నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పైడిమాంబను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. ముగ్రాటలు సమర్పించారు. భక్తులకు వెనువెంటనే దర్శనం కల్పించే విధంగా ఆలయ ఈవో ప్రసాద్, సూపరింటెండెంట్ ఏడుకొండలు ఆధ్వర్యంలో పక్కాగా ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు ఉచితంగా నీరు, మజ్జిగ, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశాయి. పైడిమాంబ కళావేదిక వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఎటువంటి వివాదాలు లేకుండా దేవర ఉత్సవం ప్రశాంతంగా ముగియడంతో దేవదాయ శాఖాధికారులు, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు

సాలూరు రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): సాలూరులో కొలువైన కామాక్షి అమ్మవారి బ్రహ్మోత్సవ పూజలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పసుపుకొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం శాస్త్రోక్తంగా మహిళలతో సామూహిక కుంకుమపూజలు చేశారు. అనంతరం హనుమద్ హోమాలు నిర్వహించారు. సాయంత్రం కామాక్షి, ఏకామ్రానాథ్‌ల కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.





పసుపుకొమ్ముల అలంకరణలో..

ఆలయంలో కుంకుమ పూజలు చేస్తూ..

బొర్ర పైడితల్లీ కరుణించు..

- పెంటశ్రీరాంపురంలో సిరిసంబరం



పూజలు చేస్తున్న భక్తులు

గంట్యాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంటశ్రీరాంపురంలో బొర్ర పైడితల్లమ్మ సిరిమానోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం పాలదారి నిర్వహించారు. సాయంత్రం 5.30 నుంచి సిరిమానోత్సవం ప్రారంభించారు. ప్రధాన వీధుల్లో సిరిమాను రథాన్ని ఊరేగించారు. జై పైడితల్లి, జైజై పైడితల్లిమ్మ నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. 18 సంవత్సరాల తర్వాత పెంటశ్రీరాంపురంలో పండగకు నిర్వహించడంతో వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న స్వగ్రామానికి చేరుకున్నారు. అమ్మవారి పండగలో పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతులు..

పెంటశ్రీరాంపురంలోని బొర్ర పైడితల్లమ్మ పండగ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులను మంగళవారం నిర్వాహకులు ప్రదానం చేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాలను విశాఖపట్నం, విజయనగరం జిల్లాలు కేవసం చేసుకున్నాయి. తృతీయ స్థానంలో చిత్తూరు, చతుర్థి స్థానంలో కృష్ణా జిల్లాకు చెందిన క్రీడాకారులు నిలిచారు. కార్యక్రమంలోఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అవనాపు విజయ్, కార్యదర్శి రంధి నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంధి అర్జున మహేశ్వరరావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పైడితల్లమ్మ సిరిమానోత్సవం

- అమ్మవారి ఉత్సవంలో మంత్రి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి

డెంకాడ, మే 13 (ఆంధ్రజ్యోతి మండలంలోని అక్కివరంలో మంగళవారం పైడితల్లమ్మ సిరిమానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేకుజాము నుంచే అమ్మవారు దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఈ పండగను వందేళ్ల తర్వాత చేయడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. దూరప్రాంతాల నుంచి భక్తులు రావడంతో గ్రామం కిక్కిరిసిపోయింది. ప్రధాన ఘట్టం సిరిమానోత్సవం సాయంత్రం 4 గంటల సమయంలో ప్రారంభమైంది. వంశపారంపర్యంగా పూజారి కంది వెంకటరామచంద్రరావు సిరిమానును అధిరోహించారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, బొబ్బిలి ఎమ్మెల్యే రంగారావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, నాలుగు మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు పైడితల్లమ్మ సిరిమాను ఉత్సవంలో పాల్గొన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డెంకాడ ఎస్ఐ ఆరంగి సన్యాసినాయుడు 40 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.



పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం



డాగ్‌స్క్వాడ్‌ను పరిశీలిస్తున్న జేసీ సేతుమాధవన్, వివిధశాఖల అధికారులు



సహాయక చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

విపత్తులపై అప్రమత్తం

- జేసీ సేతుమాధవన్

విజయనగరం క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా విపత్తులు సంభవిస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జేసీ సేతుమాధవన్ అన్నారు. మంగళవారం జిల్లా విపత్తుల యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఆర్టీసీ తదితర శాఖలు విన్యాసాల్లో భాగస్వాములయ్యాయి. అకస్మాత్తుగా విపత్కర, సంక్షోభ పరిస్థితులు ఎదురైతే, యుద్ధం వల్ల బాంబులు పడితే, గ్యాస్ లీక్, షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంటే అటువంటి సమయంలో ఏ విధంగా ప్రాణాలు కాపాడుకోవాలో వివరించారు. ఆయా శాఖల సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలను ఏ విధంగా కాపాడుతారో కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. విపత్తుల యాజమాన్య సంస్థ సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులను నిర్వహిస్తారని అన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల ప్రాణాలతో పాటు ఆస్తినష్టం జరగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విపత్తుల యాజమాన్య సంస్థ మేనేజర్ రాజేశ్వరీ, ఆర్డీవో కీర్తి, అగ్నిమాపక శాఖ అధికారి రాంప్రకాష్, వైద్యాఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ జీవనరాణి, సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు, నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, ఎన్డీఆర్ఎఫ్ అధికారి ఈశ్వరావు, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి ఎస్ఐ రఘు, తహసీల్దార్, సెక్షన్ సూపరింటెండెంట్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల ఉత్సవాలు





భోగాపురం: అమ్మవారి ఆలయం ఎదుట ఎమ్మెల్యే / రాజాం రూరల్: అసిరితల్లి సిరిమానోత్సవం / ఎస్.కోట:దారగంగమ్మకు ఊరేగింపు

రాజాం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొఠారిపురంలో మంగళవారం రాత్రి అసిరితల్లి సిరిమానోత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకూ గ్రామంలో సిరిమానోత్సవం నిర్వహించారు. 18 ఏళ్ల తర్వాత గ్రామదేవత అసిరితల్లి ఉత్సవాలు నిర్వహించడంతో వేర్వేరు చోట్ల స్థిరపడిన వారంతా గ్రామానికి చేరుకున్నారు. అమ్మవారికి పసుపు కుంకుమలు, చీర, సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పండగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

●భోగాపురం: మండలంలో గుడివాడలో మంగళవారం వారాల పండగ సందర్భంగా ముత్యాలమ్మతల్లి, తోగాలమ్మ తల్లి విగ్రహాలను వివిధ రకాల పూలు, ఆకులతో ప్రత్యేకంగా అలంకరించారు. వారాల పండగ సందర్భంగా అమ్మవార్లను ఎమ్మెల్యే లోకం నాగమాధవి, జనసేన నాయకుడు దాలయ్యరెడ్డి తదితరులు దర్శించుకున్నారు.



వేపాడ: ప్రభలు సిద్ధం చేస్తున్న భక్తులు

●నెల్లిమర్ల: మండలంలోని కొండగుంపాంలో మంగళవారం గ్రామ దేవత పండగను నిర్వహించారు. మహిళలు పైడితల్లమ్మ, ముత్యాలమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

● శృంగవరపుకోట: పట్టణంలో మంగళవారం ధారగంగమ్మ తల్లి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పాలాభిషేకం చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ పూజారి రాజా పంతులు, అనువంశీక పూజారి మోపాడ గౌరినాయుడు ఆధ్వర్యంలో సాయంత్రం పుణ్యగిరి రోడ్డులోని దేవాలయం నుంచి పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. కోలాటం వంటి పలు సంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు సాగింది.

●వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామదేవత పైడితల్లమ్మ అమ్మవారి పండగను ఈనెల 20 నుంచి నిర్వహించనున్నారు. అందులో భాగంగా మంగళవారం ఆరుగురు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నవీధిలో 38 అడుగుల ప్రభ, పెద్దవీధిలో 40అడుగుల ప్రభను ఊరేగించారు.

● జామి: మండలంలోని శాసనపల్లిలో పోలమ్మ అమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. జాతర నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

సారాపై నిఘా పెట్టండి

●ప్రొహిబిషన్ ఎక్సైజ్ డీసీ బాబ్జీరావు



మాట్లాడుతున్న డీసీ బాబ్జీరావు

విజయనగరం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠినంగా వ్యవహరించాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల అధికారులతో నవోదయం 2.0పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సారా నిందితులు, అనుమానితులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సారా వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ నెల 31 నాటికి విజయనగరం జిల్లా, జూన్ 30 నాటికి పార్వతీపురం మన్యం జిల్లాను సారా రహిత జిల్లాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రామ చంద్రరావు, జిల్లా సూపరింటెండెంట్ శ్రీనాథుడు, ఏఈఎస్‌లు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

భోగాపురం, మే13 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త జరగబోయే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం భోగాపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జీపు జాతను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు నష్టం కలిగేలా బీఎన్ఎస్ చట్టాన్ని తీసుకువచ్చి మెడపై కత్తి పెట్టారన్నారు. గతంలోని ఐపీసీ సెక్షన్స్‌ను అన్ని మార్పులు చేసి కార్మికులకు ఉద్యోగులకు నష్టం కలిగేలా కొత్త చట్టాన్ని మోదీ తీసుకొచ్చారన్నారు. పలు సమస్యలు పరిష్కారం కోరుతూ నెల 20న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.శంకర్రావు, బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మరింత నష్టం

గంట్యాడ, మే 13(ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి రాయ్‌పూర్ వరకూ హెచ్‌పీసీఎల్ ఆయిల్ పైప్‌లైన్లు వేస్తుండటంతో రైతులకు మరింత నష్టం కలుగుతోందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక కొటారుబిల్లి కూడలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని కొత్తవలస, ఎల్.కోట, గంట్యాడ, బొండపల్లి, గజపతినగరం, మెంటాడ, దత్తిరాజేరు, బాడంగి, బొబ్బిలి మండలాల్లో సుమారు 45 గ్రామాల మీదుగా 18 మీటర్ల వెడల్పుతో హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్లు వేస్తోందన్నారు. రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వానికి భారం కాకుండా విశాఖ నుంచి రాయపూర్ వరకూ నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుకుని ఉన్న భూముల్లో పైప్‌లైన్లు వేసుకోవాలన్నారు. దీనివల్ల 150 మీటర్లు దూరం తగ్గుతుందన్నారు. ఆ దిశగా అధికారుల ఆలోచన చేయాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామన్నారు. ఆయనతో పాటు రైతు సంఘం నాయకులు ఆదినారాయణ, కోడెల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించండి

గంట్యాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు జరిగే చోట మౌలిక సదుపాయాలను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నరవ గ్రామంలోని డెంకాడ చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులు వారు పరిశీలించి వేతనదారులతో మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గండేపల్లి భీముడు, ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు మాట్లాడుతూ వేతనదారులకు వేసవి అలవెన్సులు వెంటనే పునరుద్ధరించాలని, పనిముట్లు అందజేయాలని వారు డిమాండ్ చేశారు.

మురళీనాయక్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): దేశ సేవలో అమరుడైన జవాన్ మురళీ నాయక్‌కు నగరంలోని 26 డివిజన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. మంగళవారం డివిజన్‌లోని ముఖ్య కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం నాయకుడు విజ్జపు ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు విజ్జపు శంకరరావు, రామ్‌కోటి, ఎం.శ్రీనివాసరావు, కనకరాజు, కె.శ్రీనివాస్, కిశోర్, కల్యాణ్, వీర్రాజు, నానాజీ, శ్రీనివాస్, అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

38 రోజులుగా ఏపీవో సెలవులోనే..

●ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్న ఈసీ

రాజాం, మే 13 (ఆంధ్రజ్యోతి): రాజాంలో ఏపీవోగా విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించిన వెంటనే సెలవుపై వెళ్లారు. 38 రోజులు కావస్తున్నా ఆమె తిరిగి విధులకు హాజరు కావడంలేదు. ఆమె సెలవులో ఉండటంతో ఆ బాధ్యతను ఈసీ పి.శ్రీనివాసరావుకు అధికారులు అప్పగించారు. అయితే ఈసీ ప్రతిరోజు విశాఖ నుంచి రాజాం రాకపోకలు సాగిస్తున్నారు. అప్పగించిన బాధ్యతలకు ఆయన న్యాయం చేయడంలేదని పలువురు అంటున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగపూడి అనిత, కలెక్టర్ అంబేడ్కర్.. ఉపాధి పనులు పరుగులు పెట్టించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ అందుకు తగ్గట్టు పనులు సాగడంలేదు. ఎంపీడీవో శ్రీనివాసరావు ఉపాధి పనులను రోజూ పర్యవేక్షిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. ఈ విషయం ఎంపీడీవో శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా ఏపీవో విధుల్లో చేరిన వెంటనే వెళ్లిపోయారని ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు ప్రస్తుతం ఏపీవో బాధ్యతలను ఈసీ చూస్తున్నారన్నారు.

వచ్చారు.. వెళ్లారు

●ఆక్రమణలను గుర్తించని అధికారులు

శృంగవరపుకోట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిల్తంపాలెం పంచాయతీలో మూడు చెరువుల్లో ఆక్రమణల గుర్తింపునకు మంగళవారం వచ్చిన రెవెన్యూ అధికారులు రోవర్ పనిచేయడం లేదని వెనుదిరిగారు. దాంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లివాని చెరువు, మొగలాయి చెరువు, శివన్న చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని పీజీఆర్ఎస్‌లో స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు స్పందించారు. అయితే ఆక్రమణల గుర్తింపునకు వచ్చి రోవర్ పనిచేయడం లేదని వెనుదిరగడం సరికాదన్నారు. ఇకనైనా చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరారు.

సైనికుల కోసం పూజలు

గంట్యాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): త్రివిధ దళాల సైనికుల కోసం మండలంలోని పెణసాంలో గల రామాలయంలో మంగళవారం స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రివిధ దళాల్లో సేవలు అందిస్తున్న 18 మంది గ్రామస్థుల గోత్ర నామాలతో పూజలు చేపట్టారు. బీజేపీ మోర్చా అధ్యక్షుడు పిల్లా నవీన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

●భోగాపురం: దేశ రక్షణలో సైనికులు అందరూ క్షేమంగా ఉండాలని కోరుతూ మారుతీ వికలాంగుల సంఘం స్థానిక కనకదుర్గమ్మ ఆలయంలో మంగళవారం యాగం నిర్వహించింది. కార్యక్రమంలో వికలాంగులు రామిశెట్టి చిన్నారావు, బట్టా వెంకటరమణ, స్థానిక నాయకులు కె. సుభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

లక్కవరపుకోట, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు మండల వ్యవసాయాధికారి స్వాతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20లోగా రైతు సేవాకేంద్రాలకు వెళ్లి ఆధార్‌కార్డు, వన్-బి, రేషన్ కార్డు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సెరీకల్చర్, అగ్రికల్చర్, హార్టికల్చర్ రైతులు ఇందుకు అర్హులని వివరించారు.

అవయవదానానికి అంగీకారం

చీపురుపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్య, వీఆర్వోగా పని చేస్తున్న ఆయన సతీమణి రామలక్ష్మి అవయవ దానానికి ముందుకొచ్చారు. చీపురుపల్లికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ సహకారంతో వారు మంగళవారం అంగీకార పత్రాలను సమర్పించారు. చీపురుపల్లి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పుట్టా సుధీర్‌కు వారు అంగీకార పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మానవీయత సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు, ప్రతినిధి బల్లా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మామిడి పంట పరిశీలన

రాజాం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈదురు గాలుల బీభత్సంతో నేలరాలిన మామిడి కాయలను మంగళవారం ఉద్యానవన శాఖ అధికారి ఉమామహేశ్వరి పరిశీలించారు. ఈదురు గాలులతో మామిడి పంట నేలరాలిన నేపథ్యంలో జిల్లా ఉద్యానవన అధికారి ఏవీఎస్‌వీ జమదగ్ని స్పందించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం నివేదికలు అందించాలని రాజాం ఉద్యాన అధికారిని ఆదేశించారు. దాంతో ఆమె రాజాం, సంతకవిటి మండలాల్లో పర్యటించారు. పంట నష్టం, లోకల్ మార్కెట్‌లో అమ్మకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పేదలకు నిత్యావసరాలు

జామి, మే13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజినిగిరిలోని నిరుపేదలకు నెలకు సరిపడే నిత్యావసర సరుకులను విజయనగరం హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు కొవ్వాడ సత్యం, భోజరాజు నూకంనాయుడు కుటుంబసభ్యులు మాట్లాడు తూ ప్రతి ఒక్కరు పేదలకు అండగా నిలవాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల నియామకం

రాజాం, మే 13 (ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియోజకవర్గ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ మంగళవారం నియమించారు. వారికి నియామక పత్రాలను స్థానిక హోటల్‌లో అందజేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్, జిల్లా పార్టీ సీనియర్ నాయకులు సానమనేటి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రాజాం మండల పార్టీ అధ్యక్షుడిగా మజ్జి నరసింహనాయుడు, వంగర అధ్యక్షుడిగా బెవర సత్యనాయుడు, సంతకవిటి అధ్యక్షుడిగా కనకాల రాజశేఖర్ లను నియమించారు.

సర్వర్ మొరాయింపు

లక్కవరపుకోట, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆశావహులు సచివాలయాల వద్ద పోటెత్తుతున్నారు. అయితే సర్వర్లు పని చేయకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు నానా అవస్థలు పడుతున్నారు. కొత్తగా పెళ్లి అయినవారు, పుట్టిన పిల్లల నమోదు, కుటుంబాల విభజన, అడ్రసులు, పుట్టిన తేదీలు మార్పులు ఇలా పలురకాల అంశాలు రేషన్ కార్డులో నమోదు చేసుకోవడానికి లబ్ధిదారులు పోటెత్తుతున్నారు. సర్వర్ మొరాయించడంతో నిరాశతో తిరుగు ముఖం పట్టారు.

ప్రకృతి సాగుతో మేలు

గజపతినగరం, మే13 (ఆంధ్రజ్యోతి) ప్రకృతి సాగుతో నేల సారం పెరగడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం సాధ్యమవుతుందని వ్యవసాయ శాఖ జేడీ ఎ.రామారావు అన్నారు. మంగళవారం మండలంలోని కాళంరాజపేటలో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు నవధాన్యాల కిట్‌లను పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో డీపీఎం ఆనందరావు, ఏడీఏ కె.మహరాజన్ మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారికత ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారికత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం వివిధ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. మంగళవారం నియోజకవర్గం పరిధిలోని ద్వారపూడి, బుచ్చెన్నకోనేరు మార్కెట్ యార్డు వద్ద కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో వారికి కుట్టు శిక్షణ ఉచితంగా ఇవ్వడమే కాకుండా వారికి కుట్టు మిషన్లను అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గం పరిధిలోని 50 డివిజన్లలోని మహిళలందరికీ దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● మండల పరిధిలోని నారాయణపురంలో టీడీపీ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడుతో పాటు, నారాయణపురం ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులను ఆదుకోండి



ఎమ్మెల్యేతో నాయీ బ్రాహ్మణుల సంఘ నేతలు

లక్కవరపుకోట (కొత్తవలస), మే 13 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కొత్తవలస నాయీ బ్రాహ్మణుల సంఘం ప్రతినిధులు కోరారు. మంగళవారం ఎల్.కోటలోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బీసీలు నిరంతరం టీడీపీని అంటిపెట్టుకుని ఉంటున్నారని గుర్తుచేశారు. గతంలో చంద్రబాబు నాయీ బ్రాహ్మణులకు కావాల్సిన పనిముట్లు రాయితీపై అందజేసి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. మరలా అటువంటి పథకాలు తీసుకురావాలని కోరారు. కొత్తవలసలో నాయి బ్రాహ్మణుల సంఘ భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల నేత లాలం అర్జునరావు పాల్గొన్నారు.

సక్రమంగా విద్యుత్ సరఫరా చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ సులోచన

రాజాం మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ లావేటి సులోచన విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు వస్తున్నాయన్నారు. జడ్పీటీసీ సభ్యుడు బండి నరిసింహులు మాట్లాడుతూ ఈదురుగాలుల బీభత్సంతో విద్యుత్ స్తంభాలు విరిగాయని, వాటిని సకాలంలో పునరుద్ధరించాలన్నారు. ఏఈ కుమార్ మాట్లాడుతూ ఈదురు గాలులకు 10 స్తంభాలు విరిగాయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నామన్నారు. పంచాయతీలకు జమ కావాల్సిన నిధులు ప్రభుత్వ ఖాతాకు జమ అవుతున్నాయన్నారు. దాంతో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేక పోతున్నామన్నారు. సమావేశంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండు ఆలయాలకు ట్రస్ట్‌బోర్డు నోటిఫికేషన్

రాజాం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాజాం గ్రూపు దేవాలయాల పరిధిలోని రెండు ఆలయాల ట్రస్ట్ బోర్డుల నియామకాలకు సంబంధించి ఈవో బి.వి.మాధవరావు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని డోలపేటలోని ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణస్వామి దేవస్థాన తో పాటు సంతకవిటి మండలం గుళ్ల సీతారాంపురంలోని సీతారామస్వామి ఆలయాల ట్రస్ట్‌బోర్డు నియామకాల నోటిఫికేషన్‌ను ఈవో వెలువరించారు. గుళ్లసీతారాంపురం ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్తలుగా బొబ్బిలి సంస్థానాధీశులు ఉండటంతో ఇక్కడ సభ్యులను మాత్రమే నియమిస్తారు. డోలపేట ఆలయానికి సంబంధించి 11 మంది సభ్యులను నియమిస్తారు. వీరంతా ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఇదిలా ఉండగా రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు నియామకానికి సంబంధించి వంశపారంపర్య ధర్మకర్త నియామకానికి సంబంధించి న్యాయస్థానంలో వివాదం ఉండడంతో ట్రస్ట్‌బోర్డు నియామకానికి నోటిఫికేషన్ వెలువడలేదని ఈవో మాధవరావు తెలిపారు. పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానానికి దశాబ్దాలుగా రాజాం పట్టణానికి చెందిన వాకచర్ల కుటుంబీకులు వంశపారంపర్య ధర్మకర్తలుగా కొనసాగుతున్నారు. ధర్మకర్తగా కొనసాగిన వాకచర్ల చిన రామారావు మృతితో ఏర్పడిన స్థానంలో ఆ కుటుంబానికి చెందిన వ్యక్తిని గుర్తించడంలో చోటుచేసుకున్న పరిణామాలతో ట్రస్ట్‌బోర్డు నియామకం వాయిదా పడింది.

బాలికల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న పీడీ బేగం

గరివిడి, మే 13(ఆంధ్రజ్యోతి): బాలికలు అన్నిరంగాల్లో రాణించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఐసీడీఎస్ పీడీ రుక్సానా బేగం అన్నారు. మండలంలో గెడ్డపువలసలో చీపురుపల్లి ఐసీడీఎస్ పీవో ఎన్.ఆరుద్ర ఆధ్వర్యంలో బాలల హక్కులపై కిశోర బాలికలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు బాల్య వివాహాలు విడనాడాలన్నారు. పూర్తిగా చదువులపై దృష్టిసారించాలని కోరారు. మగవారితో సమానంగా మహిళలకు కూడా ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. అలాగే ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయాలన్నారు. అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం చట్టాలు రూపొందించిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ డీసీపీఎస్ లక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జ్యోతి, సుబ్బలక్ష్మి, యూనియన్ నాయకురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫాంపాండ్స్ పనులు చేపట్టండి



వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ

నెల్లిమర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఫాం పాండ్స్ పనులను చేపట్టాలని డ్వామా పీడీ ఎస్.శారదదేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని రామతీర్థం, పెరబూరాడపేట గ్రామాల్లో ఆమె పర్యటించారు. రామతీర్థంలోని తాటిమాను చెరువులో పనులను పరిశీలించి వేతనదారులతో మాట్లాడారు. రెండు పూటలా పనులు చేపట్టి రూ.307 గిట్టుబాటు వేతనం పొందాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రామారావు, ఈసీ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అండగా సీజీఆర్ఎఫ్



ఫిర్యాదు స్వీకరిస్తున్న దృశ్యం

విజయనగరం రింగురోడ్డు, మే13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వినియోగదారులకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్)అండగా ఉంటుందని చైర్‌పర్సన్ డాక్టర్ బి సత్యనారాయణ అన్నారు. మంగళవారం దొమలమందిరి వద్ద దాసన్నపేట సెక్షన్ కార్యాలయంలో సీజీఆర్ఎఫ్‌ను నిర్వహించారు. వినియోగదారుల నుంచి వినతులు స్వీకరించారు. గృహాలకు తప్పుగా బిల్లులు వేయడం, సరఫరాలో అంతరాయం, ఓల్టేజ్ హెచ్చు తగ్గులు, కొత్త కనెక్షన్లలో జాప్యం, విద్యుత్ ప్రమాదాల నివారణలో నష్టపరిహారం జాప్యం వంటి సమస్యలపై వినియోగదారులుల ఫిర్యాదులు అందజేశారు. అన్నింటినీ త్వరలో పరిష్కరిస్తామన్నారు. గతంలో అందిన 280 ఫిర్యాదులకు గానూ 271 పరిష్కరించామన్నారు. రూ.14 లక్షల అపరాధ రుసుం వసూలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు సులేఖరాణి, అర్బన్ ఇంజినీర్ త్రినాథరావు, సిబ్బంది ఉన్నారు.

క్రెడాయ్ ఉపాధ్యక్షుడిగా సుభాష్ చంద్రబోస్



సుభాష్ చంద్రబోస్

విజయనగరం రింగురోడ్డు మే 13 (ఆంధ్రజ్యోతి): విజయనగరానికి చెందిన కాటూరి సుభాష్ చంద్రబోస్ క్రెడాయ్ ఏపీ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో క్రెడాయ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. క్రెడాయ్ ఉపాధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్‌కు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కన్వీనర్‌గా, ఏపీ జీఎస్టీ కన్వీనర్‌గా, సెంట్రల్ జోన్ కన్వీనర్ ఇన్‌చార్జిగా (విజయవాడ, అమరావతి ఇతర ఆరు జిల్లాలకు) కీలక బాధ్యతలు కూడా దక్కాయి. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ మున్ముందు నిర్మాణ రంగానికి సంబంధించి అన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతానన్నారు. వ్యవసాయం తర్వాత అత్యధికంగా ఉపాధి అందిస్తున్న నిర్మాణ రంగానికి పూర్తిస్థాయిలో సేవల అందిస్తానన్నారు. అలాగే కార్మికులకు రిజిస్ట్రేషన్ కార్డులు, కార్మిక శాఖకు అమలు చేస్తున్న చట్టపరమైన హక్కులు వేతనాలు, ఉద్యోగ భద్రతపై కార్మికులకు అవగాహన కల్పిస్తామన్నారు.

కల్వర్టు నిర్మాణం చేపట్టండి

గజపతినగరం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చర్ల, ఎం.కొత్తవలస గ్రామాల మధ్య కల్వర్టు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. గజపతినగరం, గుర్ల మండలాల వారు నిత్యం ఇదే దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలం వచ్చిందంటే ఈ ప్రాంతంలో రోడ్డును దాటేందుకు వాహనదారులు, స్థానికులు జంకుతుంటారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విజయనగరం నుంచి ఎం.కొత్తవలసకు ఆర్టీసీ బస్ రాకపోకలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఇటీవల ఆర్టీసీ అధికారులు గ్రామానికి వచ్చి రూట్‌మ్యాప్ పరిశీలించారు. ఈ నేపథ్యంలో కల్వర్టు నిర్మాణం చేపడితే బస్సు రాకపోకలకు అనువుగా ఉంటుందని, లేకుంటే బస్సు సర్వీసులు నిలిచిపోయే అవకాశం ఉంటుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముచ్చర్ల వద్ద కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశం

పదోన్నతులు కల్పించాలి

● ఎన్‌ఎంయూ జోనల్ కార్యదర్శి బీఎస్ రాములు



డీపీటీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

పార్వతీపురంటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు సంబంధించిన సర్క్యులర్ 1/2019ను వెంటనే అమలు చేయాలని, ఎన్‌ఎంయూ జోనల్‌కార్యదర్శి బీఎస్‌రాములు కోరారు. మంగళవారం స్థానిక పార్వతీపురం మన్యం జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయం వద్ద ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌ఎంయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరరావు, శంకరరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులు కల్పించాలన్నారు. ఈహెచ్‌ఎస్ స్థానంలో ఆర్టీసీలో పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని, సర్క్యులర్‌కు విరుద్ధంగా ఇప్పటివరకు ఇచ్చిన పనిష్మెంట్లను రద్దు చేయాలని కోరారు. ఆర్టీసీ గ్యారేజీతోపాటు ఆన్‌కాల్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. మహిళాఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో డిపోకార్యదర్శి కేబీ రాజు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 50 మందికి ఉద్యోగాలు

సాలూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఐటీఐలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 50 మంది వివిధ ఉద్యోగాలకు, మరో 30 మంది అప్రెంటీస్‌షిప్‌కు ఎంపికయ్యారు. సాలూరు ఐటీఐలో పాటిల్ గ్రూప్ హెచ్‌ఆర్ మేనేజర డీపీ రామ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు 103 మంది నిరుద్యోగులు హాజరుకాగా, వారికి రాత పరీక్షలను నిర్వహించారు. వారిలో 50 మందిని ఉద్యోగాలకు, మరో 30 మందిని అప్రెంటీస్‌షిప్‌కు ఎంపికచేశారు. కార్యక్రమంలో నిర్మల్‌కుమార్ మిశ్రా,ఐటీఐ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యాంటీ మలేరియా మందు స్ప్రేయింగ్

సీతంపేట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుసుమూరు, టిటికుపాయి, సీతంపేట గ్రామాల్లో యాంటీ మలేరియా మందు స్ప్రేయింగ్ చేపట్టారు. మంగళారం కుసుమూరులో నిర్వహించిన స్ప్రేయింగ్‌ను దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భాను ప్రతాప్, మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావులు పరిశీలించారు.

శ్యామలాంబ గద్దెకు పోటెత్తిన భక్తులు



శ్యామలాంబ గద్దెకు ఉపాహారమివ్వడానికి బారులుతీరిన భక్తులు

సాలూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): శ్యామలాంబ పండగ ఈనెల 20 జరగనుండడంతో శ్యామలాంబ గద్దెకు ఉపాహారమివ్వడానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి గద్దెకు ఉపాహారం కింద పెసర పప్పు, బెల్లం పాకం అరిసెలు, బియ్యం, మామిడిపండ్లు, పసుపు, కుంకుమలు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. పండగకు మరో వారమే సమయం ఉండడంతో సాలూరు జన్నివీధిలోఉన్న జన్నివారింట గద్దెకు భక్తులు పోటెత్తారు. దీంతో ఉపాహారం గద్దెకు అందించడానికి ఎండలో భక్తులు బారులు తీరారు. గద్దెకు ఉపాహారమందించడానికి క్యూలో దాదాపు గంటపాటు వేచి ఉన్నారు. ఉపాహారాలను రాత్రి వరకు గద్దె వద్ద భక్తులు అందించారు.

యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న అశోక్

బెలగాం, మే13(ఆంధ్రజ్యోతి):జిల్లా ఏర్పడి నాలుగేళ్లు అవుతున్నా విద్యాభివృద్ధికి తోడ్పడే విద్యాసంస్థలు లేకపోవడం అన్యాయమని, వెంటనే యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్రకార్యదర్శి ఎ.అశోక్ కోరారు. మంగళవారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ మన్యం జిల్లా వెనుకబడిన ప్రాంతామని తెలిపారు. విద్యాభివృద్ధితోనే అభివృద్ధి చెందు తుందని చెప్పారు. విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంతా నికి అధిక ప్రాధాన్యం ఇచ్చి యూనివర్శిటి ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజు, అఖిల్, సింహాచలం పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్సతో ప్రీమెచ్యూర్ బేబీ జననం

● తల్లీబిడ్డలను కాపాడిన వైద్యులు

● విజయవంతంగా డెలివరీ చేసిన విజయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు



తల్లీబిడ్డలను కాపాడిన విధానాన్ని వివరిస్తున్న వైద్యులు

పాలకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): ఓ గర్భిణికి అరుదైన శస్త్రచికిత్సతో ప్రిమెచ్యూర్ బేబికి జన్మనిచ్చింది. గర్భిణి నెలలు నిండకుండానే పుట్టిన 900 గ్రాముల ప్రీమెచూర్ బేబీకి విజయవంతంగా విజయ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డెలివరీచేశారు. తల్లీబిడ్డల ప్రాణాలకు వైద్యులు కాపాడారు. ఆసుపత్రి యాజమాన్య వర్గాల కథనం మేరకు.. రేగిడి ఆమదాలవలస మండలంలోని కొమిర పంచాయతీ మంగళాపేటకు చెందిన ఏడు నెలల గర్భిణి ఉత్తరావల్లి లక్ష్మి వేరే ఆసుపత్రిలో పరీక్షించుకుంది. చెకప్ అనంతరంఅబార్షన్ చేయకపోతే తల్లీబిడ్డకు ప్రాణాపాయమని పేర్కొన్నారు. దీంతో లక్ష్మి కుటుంబసభ్యులు విజయ ఆసుపత్రిలో చేర్పించారు.అయితే తల్లి గర్భంలోని బిడ్డను పరీక్షించి ఆపరేషన్ చేయడం ద్వారా బిడ్డ, తల్లిని కూడా కాపాడవచ్చని గైనకాలజిస్ట్ చరిష్మా స్పష్టంచేశారు. దీంతో ప్రీమెచ్యూర్ బేబీకి జన్మనిచ్చింది. పిడియాట్రిక్ డాక్టర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పుట్టినబిడ్డకు ఎటువంటి హాని జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మంగళవారం డిశ్చార్జి చేశారు. సాధారణ ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో విజయ ఆసుపత్రి నెలకొల్పామని, ఇందులో భాగంగా ఖర్చుతో కూడుకున్న వైద్యసేవలకు నోచుకోలేని ఎంతో మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందజేస్తున్నామని ఆసుపత్రి ఎండీ దూబ పద్మావతి తెలిపారు. అరుదైన బేబీకి జన్మనిచ్చిన లక్ష్మి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.

కాశీపూర్ సమితిలో వినతుల స్వీకరణ

రాయగడ, మే13 (ఆంధ్రజ్యోతి):కాశీపూర్‌సమితిలో జిల్లా యంత్రాంగం వినతుల స్వీకరణకార్యక్రమం నిర్వహించింది.కలెక్టర్ పారుల్ పట్వారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 43 మంది అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. వీటిలో 32 వ్యక్తిగత, 11 గ్రామ సమస్యలకు సంబంధించి ఉన్నాయి. వాటిని పరిశీలించిన కలెక్టర్ వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రమేష్‌కుమార్ జెనా, ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ చంద్రాకంత్ మాఝి, జిల్లా వైద్యాధికారి మమతా సాహు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పారుల్ పట్వారి

బతికుండగానే చంపేశారు

● సంక్షేమ పథకాలు కోల్పోయిన మహిళ

● టీడీపీకి ఓటేసిందని పింఛన్ తొలగించిన వైసీపీ సర్కారు

● కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేసినా న్యాయం జరగని వైనం



రేషన్‌కార్డు, పింఛన్ పుస్తకం చూపిస్తున్న వనజాక్షి

జియ్యమ్మవలస, మే 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్కారు కక్ష సాధింపు చర్య, అధికారుల తప్పిదం వల్ల ఓ మహిళ బతికుండాగానే హౌస్ హోల్డ్ సర్వేలో చనిపోయినట్లు నమోదుచేశారు. దీంతో ఆమెకు జీవనాధారంగా ఉన్న పింఛన్‌తోపాటు సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో తనకు న్యాయంచేయాలని కాళ్లరిగేలా కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతోంది. కలెక్టర్ గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని చెబుతోంది. టీడీపీకి ఓటేశానని గత వైసీపీ ప్రభుత్వం పింఛన్ తొలగించందని బాధితురాలు వాపోతోంది.

మండలంలోని చింతలబెలగాం పంచాయతీ కేంద్రానికి చెందిన సారెపల్లి వనజాక్షికి నలుగురు సంతానం. చాలా ఏళ్ల కిందట భర్త చనిపోయారు. దీంతో రూ.200ల పెన్షన్ ఇచ్చినప్పటి నుంచి ఆమెకు పెన్షన్ వచ్చేది. కరోనా సమయంలో వైసీపీ సర్కారు పుణ్యమాని టీడీపీకి మద్దతుదారురాలుగా పేర్కొని ఆమె పింఛన్ ఐడీ నంబరు 102371015ను తొలగించారు. ఈ నేపథ్యంలో ఆమె పింఛన్ కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతోంది. కాగా మూలిగే నక్క మీద తాటి పండు పడిన చందంగా మారింది. ఈ ఏడాది జనవరి వరకు వీరికి రైస్ కార్డు నంబరు 2814951245పై ఇంటిళ్ల పాదికి రేషన్ వచ్చేది. ప్రస్తుతం ఆ కార్డు కూడా నిలిచిపోయింది. దీంతో ఇద్దరు కుమారులు హైదరాబాద్ బతుకుదెరువుకు వలస వెళ్లిపోయారు. ఆమె స్థానికంగా ఉండి కూలి పనులు చేసుకుని జీవిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో కలెక్టరేట్‌కు వెళ్లి మొరపెట్టుకుంది. కోడ్ ఉండడంతో ఏమీ చేయలేమని అధికారులు స్పష్టంచేశారు. దీంతో మళ్లీ ఏప్రిల్ ఏడో తేదీన మరొకసారి ఆమె కలెక్టర్ గ్రీవెన్స్‌కు వెళ్లింది. (అర్జీ నంబరు 141) మొరపెట్టుకుంటే వెంటనే పరిష్కరించాలని ఓ అధికారికి ఆదేశించినా ఇంతవరకు న్యాయం జరగలేదని ఆమె వాపోయింది.

హౌస్ హోల్డ్ సర్వేలో డెత్ కింద నమోదు..

చింతలబెలగాంకి చెందిన వనజాక్షికి వలంటీర్లు ఉన్న సమయంలో నిర్వహించిన హౌస్ హోల్డ్ సర్వేలో డెత్ కింద నమోదు చేయడం వల్ల ఆమె చనిపోయిన డేటాలో ఉందని సివిల్ సప్లయ్ డీటీ కిరణ్‌కుమార్ తెలిపారు.ఈవిషయం గ్రీవెన్స్ కమిషనర్‌కు తెలియజేశామని చెప్పారు. దీనికి సంబంధించిన ఆప్షన్ ఇస్తే న్యాయం చేయగలమని తెలిపారు.

శ్యామలాంబ పండగకు ముమ్మర ఏర్పాట్లు



సాలూరులోని జాతీయరహదారి-26పై లెప్రసీమిషన్ వద్ద స్వాగత ద్వారం ఏర్పాటుచేస్తున్న నిర్వాహకులు

సాలూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): సాలూరులోని ఈనెల 18నుంచి మూడు రోజులపాటు జరిగే శ్యామలాంబ పండగకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లుచేస్తున్నారు. 14 ఏళ్ల తర్వాత జరగనుండడంతో పట్టణ ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు, మహిళా, శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఆలయానికి,వేగావతి వంతెనకు రంగులువేశారు. పట్టణంలోకి ప్రవేశించేమార్గాల్లో భారీగా ఆర్చీలతో గేట్లు కర్రలతో తాత్కాలికంగా నిర్మిస్తున్నారు. పట్టణంలో విద్యుద్దీకరణ పనులు చేస్తున్నారు. జాతీయరహదారి ఇరువైపుల లైటింగ్ ఏర్పాటు చేశారు. ఈనెల 19,20 తేదీల్లో వినోద కార్యక్రమాలను సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 20న సిరిమానోత్సవం సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలకు ఏమైన భారీ వస్తువులు ఈనెల 17 కల్లా తీసుకురావాలని సాలూరు సీఐ బి.అప్పలనాయుడు కోరారు. పారిశుధ్య కార్యక్రమాలను మునిసిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావేటి బాలకృష్ణ పర్యవేక్షిస్తున్నారు. 50 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసున్నారు.పండగ విజయవంతానికి అందరు సహకరించాలని ఉత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు అక్యాన అప్పారావు కోరారు.

18 నుంచి ట్రాఫిక్‌పై ఆంక్షలు : సీఐ

సాలూరులో శ్యామలాంబ పండగ నేపథ్యంలో ఈనెల 18 నుంచి ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయడానికి కార్యాచరణ చేస్తున్నామని సాలూరు పట్టణ సీఐ బి.అప్పల నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్యామలాంబ పండగ పురస్కరించుకుని ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు, వచ్చే భక్తులు పూర్తి సహకరించి, పండగను విజయవంతం చేయాలని కోరారు. పట్టణంలో ట్రాఫిక్ ఆం క్షలు ఉన్నా, ప్రజల సౌకర్యార్థం పరిమితంగా కొన్ని ఆటోలను అనుమతిస్తున్నామని తెలిపారు. ఆ ఆటోలు పార్కింగ్ ప్రదేశాల నుంచి పట్టణంలోకి, ఇక్కడ నుంచి పార్కింగ్ ప్రదేశాల వరకు తిరుగుతాయని పేర్కొన్నారు. ఏదైన చిన్నపాటి వస్తు రవాణాకు, పట్టణంలోకి ప్రయాణికులు రావడానికి వెళ్లడానికి వినియోగించు కోవాలని కోరారు. పట్టణంలోకి ద్విచక్రవాహనాల రాకపోకలను సైతం అను మతింబోమని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు

● శ్యామలాంబ పండగ పురస్కరించుకుని ఐదు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నారు. ● రామభద్రపురం వైపు నుంచే వాహనాలకు వేగావతి వంతెన వద్ద ముత్యాలమ్మ ఆలయం ఎదురుగా, జీగిరాం వైపు నుంచి వచ్చే వాహనాలకు కేవీఆర్ లే అవుట్ వద్ద, మామిడిపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలకు నారాయణ పాఠశాల వద్ద పార్కింగ్‌కు అవకాశం కల్పించారు.● మక్కువ వైపు నుంచి వాహనాలు మక్కువ బైపాస్‌రోడ్డు వద్ద, నెల్లిపర్తి వైపు నుంచి వచ్చే వాహనాలు బంగారమ్మ కాలనీ బంతి స్టేడియం వద్ద పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. ● సాలూరు పట్టణ వీధుల్లో వాహనాలతో తిరగడాన్ని నిషేధించారు.

అశ్లీల నృత్యాలు, జూదం నిషేధం

●శ్యామలాంబ పండగ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం, మత్తు పానీయాలు సేవించరాదు.●అనుమతి లేకుండా ఎటువంటి వినోద కార్యక్రమాలు ప్రదర్శించరాదు. అశ్లీల నృత్యాలు,జూదాలు నిషేధించారు.●సిరిమానోత్సవం, ఇతర సందర్భాల్లో సంబరాలు చూడడానికి మేడలు, మిద్దెలపై జనాన్ని ఇంటి యాజమానులు అనుమతించొవద్దు. మేడలపై అధిక సంఖ్యలో జనాన్ని అనుమతించిన తర్వాత ఏమైన అవాంచనీయ సంఘటనలు జరిగితే దానికి ఇళ్ల యాజమానులే బాధ్యులవుతారు. ● బాణసంచా, డీజే,ఇతర పబ్లిక్ న్యూసెన్స్ పనులు పూర్తిగా నిషేధించారు.

హ్యాండ్లూమ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోని వెంకటగిరిలో గల శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఎస్‌పీకేఎంఐఐహెచ్‌టీ)లో మూడేళ్ల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశంకోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓఎస్‌డీ ఎస్.గిరిధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌పీకేఎం ఐఐహెచ్‌టీలో 53 సీట్లకు తమిళనాడులోని సేలంలో 12 సీట్లకు, కర్ణాటకలోని గడగ్‌లో నాలుగు సీట్లకు దరఖాస్తులను కోరుతున్నట్టు పేర్కొన్నారు. పదో తరగతి లేదా తత్సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులై జూలైఒకటో తేదీ నాటికి బీసీ, జనరల్ కేటగిరీలకు 15-23 సంవత్సరాలమధ్య, ఎస్సీ, ఎస్టీలకు 25 సంవత్సరాల వయస్సు ఉండాలని తెలిపారు. మూడేళ్ల డీహెచ్‌టీటీ కోర్సులో ఇంటర్ ఎంపీసీ, ఒకేషనల్ (టెక్స్‌టైల్స్), ఐటీఐకోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్‌ఒకటో తేదీలోగా దరఖాస్తు చేసు కోవాలని, మరిన్నివివరాలు08625- 295003, 9399936872, 9866169908,9010243054 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రుణాల బడ్జెట్ పెంచాలి

పాలకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): తూర్పుకాపులకు ఇచ్చే రుణాలు బడ్జెట్ పెంచాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టంకాల దుర్గారావు ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల కార్పొరేషన్ ద్వారా చేసిన రుణాల మంజూరు సరిపోవడం లేదని తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు.తూర్పు కాపులకు రూ.500 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

టీఏసీని ఏర్పాటుచేయాలి

సీతంపేటరూరల్, మే13 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం సానుకూలంగా డిమాండ్లు పరిష్కరించాలని ఏజేఏసీ పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ కె.ధర్మారావు మంగళవారం ఒక ప్రకటన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ట్రైబల్ అడ్వయిజరీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి షెడ్యూల్ ఏరియా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. మెగా డీఎస్సీ-25 ప్రకటించిన ఏజెన్సీ పోస్టులను మినహాయించి ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

డీఏలకు పదోన్నతులు

సీతానగరం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు సచివాలయాల్లో డిజిటల్ సహాయకులు (డీఏ)గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ మార్గదర్శకాలు బుధవారం మండల పరిషత్‌కు వచ్చాయి. కాశీపేట సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న డీఏ రెడ్డి మౌళీశ్వరరావుకు బలిజిపేట మండలంలోని శివరాంపురం పంచాయతీకి గ్రేడ్-5 కార్యదర్శిగా, గాదెల వలస లో డీఏగా విధులు నిర్వహించిన సొంగల గణేష్‌ను గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి కల్పిస్తూ బొబ్బిలి మండలం జె.రంగరాయపురం పంచాయతీ కార్యదర్శిగా నియమితులయ్యారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ

● పార్వతీపురం మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు



వైకేఎం కాలనీలో ట్యాంకరుతో తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

పార్వతీపురంటౌన్, మే 13 (ఆంధ్రజ్యో తి): పట్టణంలోని 30 వార్డుల్లో వేసవిలో ఎటువంటి ఇబ్బం దులు లేకుండా తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవా రం పట్టణంలోని శివా రు కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా పంపిణీని పరిశీలించా రు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నీటిఎద్దడి నివారణకోసం యుద్ధప్రాతిపదికన ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి సమీపంలోని నాగావళి నది నుంచి ప్రధాన పంప్‌హౌస్‌కునీటిని మళ్లించేందుకుప్రణాళికలు సిద్ధంచేశామన్నారు. ఆయావార్డుల్లో తాగునీటిసరఫరాకు సంబంధించి ఎప్పటికప్పుడు ఇంజ నీరింగ్ విభాగానికి అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. వైకేఎం,కొత్తవలస గ్రీన్‌ఫీల్డ్ కాలనీ, నవిరి, జనశక్తి, తదితర పట్టణ శివారుల్లోఉన్న కాలనీలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరం దిస్తున్నామని తెలిపారు. తాగునీటి సరఫరాకు సంబంధించి వార్డుల్లో సమస్యలు ఉంటే కార్యాలయానికి వచ్చి తెలియజేయాలని కోరారు

తోటపల్లి ఆయకట్టుకు నీరందించాలి

● కాలువలకు మరమ్మతులు చేయాలి ● రైతు సంఘం నాయకులు



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

పాలకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి బ్యారేజీ ఎడమ, కుడి కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీరందించాలని రైతు సంఘం నాయకులు కోరారు. మంగళవారం పాలకొండ సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటపల్లి కుడి ప్రధాన కాలువ పరిధిలో సుమారు ఎనిమిది వేల ఎకరాలు, ఎడమ ప్రధాన కాలువ పరిధిలో 32 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి తోటపల్లి బ్యారేజీని అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం 1902లో ఏర్పాటు చేసిందని తెలిపారు. నాగావళి నదిపై ఉన్న ఓపెన్ చానళ్లకు ఎడమ ప్రధాన కాలువ ద్వారా అనుసంధానం చేస్తూ సాగునీరు ఇవ్వడానికి బ్యారేజీ కట్టే సమయంలో డిజైన్ చేశారన్నారు. ప్రస్తుతం బ్యారేజీ తూము వద్ద షట్టర్లు ఫంక్షనింగ్ సరిగ్గా జరగకపోవడంతో కాలువలో నీటి ప్రవాహాన్ని నియంతించడానికి అవకాశం లేకుండాపోతోందన్నారు. కాలువలకు ఖరీఫ్ సీజన్‌నాటికి మరమ్మతులు చేయించి కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు, గురుబిల్లి అప్పలనాయుడు, రౌతు సోంబాబు, పామోటి వైకుంఠరావు, కిమిడి రామ్మూర్తినాయుడు, వావిలపల్లి రమణమూర్తి, లోలుగు సంగంనాయుడు, కోట విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

భారతీయులు సురక్షితంగా ఉండాలి



తోటపల్లిలో పూజలు నిర్వహిస్తున్న జనసేన నాయకులు

గరుగుబిల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నైతిక మద్దతుగా దైవ బలం, దివ్యాశీస్సులు ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు జనసేన కురుపాం నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం తోటపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కురుపాం నియోజకవర్గ జనసేన ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్‌పై చేస్తున్న ధర్మ యుద్ధంలో సైనికులు, భారతీయులు సురక్షితంగా ఉండేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు బోను శివ, ఏఎంసీ వైస్ చైర్మన్ జి.గౌరీశంకరరావు, కొమరాడ మండలాధ్యక్షులు టి.శ్రీకర్ పాల్గొన్నారు.

గాలికి తెగిపడిన విద్యుత్ వైర్లు

సీతానగరం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పణుకుపేట - రంగంపేట గ్రామాల మధ్య బీటీ రోడ్డుపై విద్యుత్ వైర్లు మంగళవారం వీచిన గాలికి తెగిపడిపోవడంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు ఇచ్చిన సమాచారంతో స్పందించి వైర్లను తొలగించారు. దీంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరా లేని సమయంలో తీగలు పడటంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

● గరుగుబిల్లి సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి



గరుగుబిల్లి:కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి

గరుగుబిల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వాలంబన మెరుగుపరచడమే ధ్యేయమని గరుగుబిల్లి సెక్టార్ సూపర్‌వైజర్ రైతు లక్ష్మి తెలిపారు. మంగళవారం గరుగుబిల్లిలో బాలల హక్కులు, రక్షణపై కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల పదో తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది బిడ్డిక చిన్నమ్మి, సీహెచ్ ఉదయకుమారి, మహిళా సంరక్షణ అధికారి గొర్లి భవాని, అంగన్‌వాడీ వర్కర్లు పల్ల కృష్ణవేణి, మహంతి పద్మావతి పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ పంచాయతీ టిక్కబాయిలో కిశోరి వికాసంలో భాగంగా బాలల హక్కులు, సంరక్షణపై అవగాహన కార్యక్రమంపై మంగళవారం నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ మిడతాన అరసవల్లినాయుడు బాలల హక్కులు, సంరక్షణపై వివరించారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలన్నారు. కార్య క్రమంలో మహిళా పోలీస్ ఎన్.పాప, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

●బలిజిపేట, మే 13(ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికలను వెంటాడుతున్న లింగ వివక్ష, సైబర్ నేరాలు, ఆహారలోపం, అనారోగ్యం, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, అక్రమ రవాణా సమూలంగా అరికట్టడంతో పాటు భవితకు భరోసా కల్పించడమే కిశోరీ వికాసం లక్ష్యమని ఐసీడీఎస్ పీవో సులేఖ తెలిపారు. ఎదపెంకి గ్రామంలో కిశోరి వికాసంపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలరోజులపాటు కిశోరి బాలికల అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల లీగల్ ప్రొఫెషన్ ఆఫీసర్ పి.శ్రీధర్, డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స సకాలంలో అందించాలి

పార్వతీపురం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి):అత్యవసర పరిస్థితుల్లో ప్రథమచికిత్స సకాలంలో అందించడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించవచ్చని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాంఅధికారి టి.జగన్మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పెదబొండపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. ఆరోగ్య తనిఖీలు, వైద్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రిలో వినియోగించే పరికరాలు, కిట్లు,అత్యవసర సమయంలో ప్రథమ చికిత్సకు అందుబాటులో ఉన్న పరికరాలు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్, సిలిండర్, ఆక్సిజన్ ఫ్లోమీటర్, అంబుబ్యాగ్, ఈసీజీ యంత్రం, బీపీ పరికరం, సీబీసీ,యూరిన్ అలైజర్స్, వీల్‌చైర్, స్ట్రెచర్, అగ్నిమాపక యంత్రం, బ్యాటరీ బ్యాక్ అప్, కోల్డ్ చైన్ సిస్టమ్, అత్యవసర ఇంజెక్షన్లు పరిశీలించారు. వీటి పనితీరును ఎప్పటికప్పుడు గమనించాలని, సాంకేతిక సమస్య వస్తే వెంటనే పరిష్కరించాలన్నారు. విపత్తులు, ప్రమాదాలు, ఎపిడమిక్ తదితర అత్యవసర సమయాల్లో ఆరోగ్య కేంద్రాల్లో ప్రథమ చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జి.ధరణి, జి.ధరణి, జి.గోపాలకృష్ణ, ఎపిడమిక్ సత్తిబాబు, సూపర్‌వైజర్లు వెంకటనాయుడు, జయలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.